ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు

5

సోమవారం 24 మార్చి 2025

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమవారం సాయంత్రం)	సెహరీ (మంగళవారం ఉదయం)
కడప	6.31	5.03
ప్రొద్దుటూరు	6.32	5.05

చల్లంగ చూడమ్మా..

పెద్దమ్మ తల్లీ..!

- వైభవంగా అమ్మవారి జాతర
- వేలాదిగా తరలివచ్చిన మహిళలు
- తిరునాళ్లను తలపించిన భక్తుల సందడి



మైదుకూరులో వేలాది మంది భక్తుల తాకిడి



మైదుకూరులో ముస్తాబైన పెద్దమ్మతల్లి

మైదుకూరురూరల్/ఎర్రగుంట్ల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మైదుకూరు, ఎర్రగుంట్లలో పెద్దమ్మ తల్లి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. చల్లంగ చూడమ్మా.. పెద్దమ్మ తల్లీ అంటూ భక్తులు అమ్మవారిని వేడుకొన్నారు. మహిళా భక్తులు బోనాలు తీసుకొని వేలాదిగా తరలిరావడంతో తిరుణాలను తలపించింది.

మైదుకూరులో.. పాతూరులో వెలసిన పెద్దమ్మతల్లి దేవర ఉత్సవ వేడుకల సంబరాలు ఆదివారం అంబరాన్నంటాయి. తెల్లవారుజామున మట్టితో తయారు చేసిన పెద్దమ్మతల్లి, చిన్నమ్మతల్లి ప్రతి రూపాలను ఊరేగింపుగా డప్పుల, బాణసంచాల మధ్య పెద్దమ్మతల్లి ఆలయం వద్ద కూర్చోబెట్టారు. మట్టి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాలా మంది భక్తులు తమ ఇళ్ల వద్ద నుంచే మండుటెండలో పొర్లు దండాలు పెట్టుకొంటూ పెద్దమ్మ వద్దకు చేరుకొని తమ మొక్కులను చెల్లించారు. రాత్రి పెద్దమ్మ, చిన్నమ్మ మట్టి విగ్రహాలను పొలిమేరలో ఉంచేందుకు ఊరేగింపుగా బయలుదేరారు.

● ఊరేగింపులో అపశ్రుతి

తెల్లవారుజామున పెద్దమ్మతల్లి, చిన్నమ్మతల్లి మట్టి విగ్రహాలను ప్రొద్దుటూరు రోడ్డులో నుంచి పెద్దమ్మతల్లి ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళుతుండగా బాణసంచాలు కాల్చారు. అన్నక్యాంటీన్ వద్దకు రాగానే కొందరు ఆకతాయిలు బాణసంచాలు కాల్చడంలో నిర్లక్ష్యం కారణంగా అక్కడ ఉన్న పిల్లలు, మహిళల మధ్య బాణసంచాలు పేలడంతో ఒక బాలుడికి, నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు.

పోట్లదుర్తిలో వెలసిన పెద్దమ్మ తల్లికి ఆదివారం చల్ల కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఉదయం గ్రామంలో మహిళలందరూ ఒక్కసారిగా పెరుగన్నం, పులగం, వేపాకుల నైవేద్యంతో కూడిన మట్టికుండలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా బయలుదేరారు. నాలుగురోడ్ల వద్దకు సుమారు 4 వేల మంది మహిళలు చల్లకుండలతో చేరుకోవడంతో మరో పెద్దమ్మ జాతరను తలపించింది. అక్కడి నుంచి ఇసుకేస్తే రాలనంతగా భక్తులు కలిసికట్టుగా అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం అమ్మవారికి చల్లను సమర్పించారు. పురాతన సంప్రదాయంలో భాగంగా అమ్మవారికి చెందిన వెండి ఆభరణాలతో కూడిన పెట్టెను ఊరేగింపుగా తీసుకొచ్చి పెద్దమ్మతల్లికి సమర్పించారు.



పోట్లదుర్తిలో పెద్దమ్మతల్లికి చల్ల తీసుకువస్తున్న మహిళా భక్తులు

వైసీపీలో కూటమి భయం



- జడ్పీటీసీలు క్యాంపునకు తరలింపు
- 30 మందే పయనం
- మూడురోజుల పాటు శిబిరంలోనే
- 26న సాయంత్రం కడప శిబిరానికి రాక
- 27న జడ్పీ చైర్మన్ ఎన్నికకు హాజరు

కడపరూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీని కూటమి భయం పట్టుకుంది. మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ జమాకానాలోని జడ్పీ చైర్మన్ ఎన్నిక ఈ నెల 27న జరగనుంది. ఈ ఎన్నికల్లో టీడీపీ కూటమికి సునాయసంగా 7 నుంచి 10 మంది జడ్పీటీసీల బలం ఉన్నప్పటికీ టచ్ చేయలేదు. చైర్మన్ గిరి కావాలనుకొని కాస్త కష్టపడి ఉండింటే చైర్మన్ గిరి దక్కించుకొనే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. కానీ టీడీపీ కూటమి ఈ దిశగా దృష్టి సారించలేదు. అయితే వైసీపీ ఎందుకో ఏమో చైర్మన్ గిరి చేజారుతుందేమోనని కంగారుపడుతోంది. తమ 48 మంది జడ్పీటీసీలలో ఇప్పటికే ఆరు మంది ప్రత్యక్షంగా టీడీపీలోకి వెళ్లిపోయారు. వీరు కాక ఇంకా పలువురు జడ్పీటీసీలు టీడీపీకి టచ్‌లో ఉన్నట్లు చెప్పుకొస్తున్నారు. వెరసి ఈ నెల 27న జరగనున్న జడ్పీ చైర్మన్ ఎన్నిక వేళ తమ జడ్పీటీసీలు ఎక్కడ కొంప ముంచుతారోనన్న భయం వైసీపీ పెద్దలను పట్టిపీడిస్తోంది. చైర్మన్ ఎన్నిక నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి జడ్పీటీసీలకు వైసీపీ బ్రెయిన్ వాష్ చేసే పనిలో నిమగ్నమైంది. అసంతృప్తిలో ఉన్న వారిపై ఫోకస్ పెట్టింది. వీరు చేజారకుండా ఉండేందుకు క్యాంపు తరలింపునకు పథక రచన చేశారు. కడప నగరం ఆలంఖాన్‌పల్లెలోని ఎంపీ అవినాష్‌రెడ్డి నివాసంలో మార్చి 21న విందు పేరుతో జడ్పీటీసీలను రప్పించి 23న క్యాంపునకు తరలిరావాలని ఆదేశించారు.

జడ్పీటీసీలు హైదరాబాద్ క్యాంపునకు తరలింపు

జడ్పీ చైర్మన్ ఎన్నిక వేళ వైసీపీ నేతలు తమ జడ్పీటీసీలను క్యాంపునకు తరలించారు. జిల్లాలోని ఆయా మండలాల జడ్పీటీసీలు ఆదివారం మధ్యాహ్నం కడప నగరం ఆలంఖాన్‌పల్లెలోని ఎంపీ అవినాష్‌రెడ్డి గృహానికి చేరుకున్నారు. అక్కడి నుంచి 3 గంటలకు రెండు బస్సులు, ఐదారు కార్లలో జడ్పీటీసీలు తరలివెళ్లారు. కానీ 30 మంది జడ్పీటీసీలు మాత్రమే క్యాంపునకు పయనమైనట్లు సమాచారం. అప్పటి వైసీపీ పాలనలో 2021లో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో మొత్తం 50 స్థానాల్లో 49 స్థానాలను ఏకగ్రీవాల పేరుతో కైవశం చేసుకుంది. తరువాత పులివెందుల జడ్పీటీసీ సభ్యుడు మరణించారు. ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యుడు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో చైర్మన్, జడ్పీటీసీ పదవులకు రాజీనామా చేశారు. అలాగే మరో ఏడుగురు జడ్పీటీసీ సభ్యులు 2024 సాధారణ ఎన్నికల్లో టీడీపీలోకి వెళ్లారు. ఇలా క్రమేనా వైసీపీ బలం 40కి పడిపోయింది. ఈ నేపథ్యంలో మార్చి 27న జరుగుతున్న జడ్పీ చైర్మన్ ఎన్నిక వేళ వైసీపీ మిగిలిన జడ్పీటీసీలను ఆదివారం చేజారకుండా క్యాంపునకు తరలించింది. కానీ ఈ క్యాంపునకు 30 మంది జడ్పీటీసీలు మాత్రమే పయనమైనట్లు వినికిడి. దీంతో వైసీపీలో కాస్త కంగారు మొదలైంది. జడ్పీ చైర్మన్ ఎన్నికల్లో 50 శాతం సభ్యులు హాజరైతేనే ఎన్నిక ఉంటుంది. అంటే ప్రస్తుతం ఉన్న మొత్తం 48 మంది జడ్పీటీసీలలో 24 మంది తప్పక హాజరుకావాలి. ప్రస్తుతం వైసీపీ శిబిరంలో 30 మంది జడ్పీటీసీలు మాత్రమే ఉన్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. శిబిరంలో ఉన్నవారిలో ఆరేడు మంది జంప్ అయితే వైసీపీ ఎత్తుగడలు తలకిందులేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

జడ్పీటీసీల తరలింపుపై వైసీపీ నేతల నిఘా

ఉమ్మడి కడప జిల్లాలోని జడ్పీటీసీల తరలింపుపై నిఘా ఉంచారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాధ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆకేపాటి అమరనాధరెడ్డి, సుధ, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు తదితరులు ఎంపీ అవినాష్‌రెడ్డి ఇంటి నుంచి జడ్పీటీసీలను హైదరాబాద్‌లోని శిబిరానికి దగ్గరుండి పంపించి దారిలో వారు చేజారకుండా జడ్పీటీసీల వాహనాలను అనుచరుల ద్వారా ఐదారు కార్లలో అనుసరించినట్లు సమాచారం. వీరు ఆదివారం రాత్రి నుంచి సోమ, మంగళ, బుధవారం మధ్యాహ్నం వరకు క్యాంపులోనే ఉండి తరువాత అక్కడ నుంచి బయలుదేరి అదే రోజు రాత్రికి కడపలో ఏర్పాటు చేసిన క్యాంపునకు, అక్కడి నుంచి గురువారం ఉదయం 10 గంటలకు జడ్పీకి చేరుకుంటారు. అక్కడ జరిగే ప్రత్యేక సమావేశం, చైర్మన్ ఎన్నికల్లో పాల్గొనేలా వైసీపీ జిల్లా నాయకత్వం చర్యలు చేపట్టింది.

కొనసాగుతున్న విచారణ

- నోటీసులు ఇచ్చి విచారిస్తున్న పోలీసులు

పులివెందులటౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించిన సాక్షులు ఒక్కొక్కరుగా అనుమానాస్పదంగా మృతి చెందుతున్న విషయంపై సిట్ విచారణ కొనసాగుతోంది. 2019 సెప్టెంబరు 2న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సింహాద్రిపురం మండలం కసనూరుకు చెందిన కటిక రెడ్డి శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యులను శనివారం రాత్రి పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ విచారించినట్లు సమాచారం. వివేకా హత్య కేసులో శ్రీనివాసులరెడ్డి కీలక సాక్షిగా ఉన్నారు. వివిధ పరిణామాలపై రాత్రి 10 గంటల వరకు విచారణ సాగింది. మొత్తం ఆరుగురిని విచారణకు రావాలని పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ నోటీసులు జారీ చేశారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి ఇద్దరిని, ఆదివారం ఒకరిని విచారించినట్లు సమాచారం. సోమవారం నలుగురిని విచారించనున్నట్లు తెలుస్తోంది.

సతీష్‌ను సొంత కొడుకులా చూసుకున్నారు

- అధికారంలో ఒక మాట.. ప్రతిపక్షంలో మరో మాట
- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందులటౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని ఎస్‌వీ సతీష్‌కుమార్‌రెడ్డిని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సొంత కొడుకులా చూసుకున్నారని, కానీ నేడు చంద్రబాబు మోసగాడు అంటూ విమర్శించడం సతీష్‌రెడ్డికి తగదని పశ్చిమరాయలసీమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త బిచ్చగాడు పొద్దెరగనట్లు సతీష్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని, 1998లో మండల పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటి నుంచి 2019 వరకు మంచిగా ఉన్న చంద్రబాబు, లోకేశ్‌లు నేడు చెడ్డవారయ్యారా ? తప్పుడు కేసులు పెట్టి వేధించిన జగన్, వైఎస్ కుటుంబ సభ్యులు నేడు మంచోళ్లు అయ్యారా.. అని ప్రశ్నించారు. నియోజకవర్గ విభజన జరిగితే వేంపల్లె నియోజకవర్గంగా అవుతుందని అప్పుడు ఎమ్మెల్యే సీటు ఇస్తారన్న దూరపు ఆలోచనతో చంద్రబాబు, లోకేశ్‌ను దూషించడం ఆయన స్వార్థ రాజకీయాలకు నిదర్శనమన్నారు. వేంపల్లెలో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఏనాడైనా సమస్య పరిష్కారానికి కనీసం కలెక్టరు దృష్టికి అయినా తీసుకెళ్లారా అని ప్రశ్నించారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఆయన ఇంటి నుంచి పోటీ చేసి అతని సత్తా ఏంటో చూపించాలన్నారు. ఇప్పటికైనా సతీష్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాధరెడ్డిలు ఇష్టానుసారంగా మాట్లాడడం మానుకోవాలని, ప్రజాశ్రేయస్సు దృష్టిలో ఉంచుకుని ప్రజా సమస్యలపై పోరాడేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మైసూరారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కడప కలెక్టరేట్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సభాభవనంలో డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంతో పాటు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం సోమవారం జరుగుతోందని డీఆర్‌వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు తమ సమస్యలు పీజీఆర్‌ఎస్‌లో అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

టీబీ రహిత సమాజానికి

ప్రతిఒక్కరూ కృషి చేయాలి

- పోస్టర్ల ఆవిష్కరణలో కలెక్టర్ శ్రీధర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

కడప మారుతీనగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ప్రజలకు సూచించారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం (ఈ నెల 24 సోమవారం) సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో క్షయ వ్యాధిపై అవగాహనకు సంబంధించిన పోస్టర్లను ఆయన చాంబర్‌లో కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సా విధానం తదితర విషయాలను ప్రజలకు తెలియజేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రవిబాబు, సిబ్బంది సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యా వికాసం 7

● జేఎన్టీయూ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో.. చోరీలకు చెక్! 7

● దొంగలు ఇంట్లోకి ప్రవేశిస్తే ఇట్టే పట్టేస్తుంది

హౌస్ బిల్డింగ్ సొసైటీ సమావేశం వాయిదా

- అక్రమాలు వెలుగు చూస్తాయనే దుమ్మా..
- నిరసన వ్యక్తం చేసిన సభ్యులు



నిరసన వ్యక్తం చేస్తున్న సభ్యులు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఎన్జీఓస్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఆ సొసైటీ తాత్కాలిక అధ్యక్షుడు పి.శ్రీనివాసులు ప్రకటించారు. ఈ సమావేశం ఆదివారం సొసైటీ కార్యాలయంలో నిర్వహించారు. దాదాపు 11 వేల మంది సభ్యులు ఉండగా మూడువేల మంది యాక్టివ్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే సమావేశానికి తగినంత కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

● అక్రమాలు వెలుగు చూస్తాయనే

జనరల్ బాడీ మీటింగ్ వాయిదా వేయడాన్ని డైరెక్టర్లుగా ఉన్న రమేష్‌కుమార్, వల్లం సుబ్బారెడ్డి, నంద్యాల శివశంకర్‌తో పాటు సమావేశానికి హాజరైన సభ్యులందరూ నిరసన వ్యక్తం చేశారు. లెక్కల కొండారెడ్డి అధ్యక్షతన గడచిన ఐదేళ్ల కాలంలో పలు అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని సమావేశం కొనసాగిస్తే వాటిని సభ్యులు ప్రశ్నిస్తారనే ఉద్దేశంతోనే కోరం లేదనే సాకుతో సమావేశాన్ని వాయిదా వేశారని డైరెక్టర్లు రమేష్‌కుమార్, నంద్యాల శివశంకర్, వల్లం సుబ్బారెడ్డి ఆరోపిస్తున్నారు. సొసైటీ అధ్యక్షుడు అందుబాటులో లేని సమయంలో ఉపాధ్యక్షుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని, ఆయన అందుబాటులో లేనిపక్షంలో మెజారిటీ సభ్యులు తాత్కాలిక అధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. కానీ ఇక్కడ కార్యదర్శిగా ఉన్న వ్యక్తి అధ్యక్షుడిగా ఎలా ఉంటారంటూ వారు ప్రశ్నించారు. సొసైటీలో అక్రమాలు జరిగాయని వాటిపై ఇప్పటికే చాలా మంది విచారణ కోరారన్నారు. కాగా సమావేశాన్ని వాయిదా వేయడాన్ని నిరసిస్తూ సొసైటీ కార్యాలయం ఎదురుగా తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఎంక్వైరీ రిపోర్టుపై తగు చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు. ప్రొద్దుటూరు ఏపీజీఏ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రావు, ఎన్జీఓ మాజీ అధ్యక్షుడు మునయ్య తదితరులు పాల్గొన్నారు.

పెనుగాలులకు అరటి తోటలు నేలమట్టం

- 2455 ఎకరాలు.. రూ.20 కోట్ల నష్టం



వెలదండ్లలో పడిపోయిన అరటి

పులివెందుల/లింగాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలంలో శనివారం రాత్రి పెనుగాలుల బీభత్సం సృష్టించాయి. కన్నుమూసి తెరిచేలోపు రైతులకు కన్నీళ్లు మిగిలాయి. దాదాపు గంటపాటు వీచిన ఈదురుగాలులు, పడిన వడగండ్లకు అరటి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. లింగాల మండలంలోని కోమన్నూతల, తాతిరెడ్డిపల్లె, పార్నపల్లె, ఎగువపల్లె, మురారిచింతల, దిగువపల్లె, వెలిదండ్ల, లింగాల, లోపట్నూతల, రామన్నూతలపల్లె, చిన్నకుడాల, పెద్దకుడాల గ్రామాలలో ఈ పెనుగాలులు రైతును తేరుకోలేని విధంగా వెన్నువిరిచాయి. శనివారం సాయంత్రం పచ్చగా కళకళలాడుతూ గెలలతో ఉన్న తోట ఆదివారం ఉదయం 6 గంటలకు రైతులు తోట దగ్గరికి వెళ్లి చూస్తే నేలమట్టమవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. నెలరోజుల్లోపే దిగుబడి చేతికొస్తున్న సమయంలో ఇలా పెనుగాలుల బీభత్సానికి నేలమట్టమవడం రైతుకు తీరని నష్టం ఏర్పడింది. కాగా పెనుగాలులు, వడగండ్ల వానకు దాదాపు 2455 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో వీచిన పెనుగాలులకు రైతులకు దాదాపు రూ.20 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామన్నారు. మండలంలో 9300 ఎకరాల్లో అరటి సాగైందన్నారు. ఈ నష్ట నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు.

అరటి రైతులను ఆదుకుంటాం..


లింగాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పెనుగాలులు, వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న అరటి రైతుల సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. లింగాల మండలం తాతిరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం ఆయన నేలకూలిన అరటిచెట్లను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ అరటి దిగుబడులు మార్కెట్‌కు తరలించే సమయంలో పెనుగాలుల వలన నేలకూలడం బాధాకరమన్నారు. అధికారులు రేపటి నుంచి క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలించి రైతుల వివరాలను సేకరిస్తారన్నారు. టీడీపీ నాయకులు సంజీవరెడ్డి, విశ్వనాథరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



రైతులతో మాట్లాడుతున్న బీటెక్ రవి

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ఉదయం అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. వివిధ ప్రాంతాల నుంచి సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆకు పసరు తాగి తడిబట్టలతో ఆలయంలో ఒరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో బండి నడిపితే.. కేసులే..!

● డ్రంక్ అండ్ డ్రైవ్ నివారణ చర్యలు కట్టుదిట్టం


డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న పోలీసులు

పులివెందుల టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) :మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. పులివెందుల ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో ఇటీవల మద్యం తాగి వాహనాలు నడుపుతున్న కేసులు పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లనే చోటు చేసుకుంటున్నట్లు పోలీసుల పరిశీలనలో తెలిసింది. ఈ నేపథ్యంలో పులివెందుల ట్రాఫిక్ పోలీసులు పార్నపల్లె రోడ్డు, ఆర్టీపీ బస్టాండు కూడలి, ముద్దనూరు రోడ్డు, ఉలిమెల్ల రోడ్డు, కడప రోడ్డు, పూలంగళ్ల సర్కిల్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. బ్రీత్ అనలైజరు ద్వారా పరీక్షలు చేస్తూ వాహనదారులు ఎవరైనా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయితే తక్షణమే కేసులు నమోదు చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, కారు, జీపులు, ఆటోలు, లారీ డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నవారిలో ఉంటున్న వీరిలో లారీలు, ఆటో డ్రైవర్లే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. మద్యం తాగి బైకులు నడుపుతూ పట్టుబడుతున్న వారిలో యువకులు ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోందని పోలీసులు చెబుతున్నారు. దీంతో మత్తు దిగిన తరువాత యువకులకు కౌన్సిలింగ్ ఇస్తున్నామని చెబుతున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చేతివాటం..?

తనిఖీల పేరుతో పోలీసులు దూకుడుగా వ్యవహరిస్తున్నారని డ్రంకెన్ డ్రైవ్ పేరుతో అకారణంగా వేధిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డ్రైవింగ్ లైసెన్సు, సీ-బుక్ తీసుకుని, వాహనాలను స్టేషన్‌లో ఉంచుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు అంటున్నారు. అదే విధంగా డ్రంకెన్ డ్రైవ్‌లో తనిఖీల సమయంలో మందుబాబుల వద్ద పలువురు పోలీసులు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. మందు తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే ఆ కేసుతో సరిపెట్టకుండా లైసెన్సు, సీ బుక్, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటివి కూడా అడుగుతున్నారని, వాటిలో ఏమీ లేకున్నా భారీగా జరిమానాలు విధిస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదంటూ ఇతర సాకులు చూపుతూ సెల్ ఫొటోలు తీసి ఈ-చలానాలతో బెంబేలెత్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల మేరకే కేసులు నమోదు చేస్తున్నామని పోలీసులు అంటున్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం


● జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి


బ్యాడ్మింటన్ ఆడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

కడప స్పోర్ట్స్, మార్చి23 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం అవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి అన్నారు. ఆదివారం స్థానిక పీవీఆర్ ఇండోర్ స్టేడియంలో న్యాయశాఖ ఉద్యోగుల బ్యాడ్మింటన్ పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ పని ఒత్తిడితో సతమతమయ్యే న్యాయశాఖ ఉద్యోగులకు క్రీడలు కాసింత మానసిక ఉపశమనాన్ని అందిస్తాయన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని కాసేపు బ్యాడ్మింటన్ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బాబాఫకృద్దీన్, అదనపు న్యాయమూర్తి రామారావు, ప్రభుత్వ ప్లీడర్ శివశంకర్‌రెడ్డి , జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ జిలానీబాషా, పలువురు న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో.. చోరీలకు చెక్!

● దొంగలు ఇంట్లోకి ప్రవేశిస్తే ఇట్టే పట్టేస్తుంది
● ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
● 13 నెలల్లో 621 మంది వినియోగం



కడప క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా కలిసి ఎక్కడికైనా వెళుతున్నారా.. మీ ఇంట్లో విలువైన సామాన్లు గ్రట్రా ఉన్నాయా, ఎక్కడికైనా వెళ్లాలంటే భయపడుతున్నారా..? అయితే ఇప్పటి నుంచి ఆ భయాన్ని మానుకోండి. దొంగలను ఇట్టే పట్టించే యాప్ ఇప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంది. జిల్లాలోని ప్రజలు జిల్లా పోలీసు శాఖ అందిస్తున్న లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్ హెచ్‌ఎంఎస్) యాప్‌ను సద్వినియోగం చేసుకోవడం ద్వారా దొంగతనాలు అరికట్టేందుకు ఎల్‌హెచ్ ఎంఎస్ యాప్‌ను మొబైల్ ఫోనుతో అనుసంధానం చేసుకుంటే ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా నిశ్చింతగా వెళ్లవచ్చు. మీ మొబైల్ ఫోను ద్వారా మీ ఇంట్లోని పరిస్థితిని సమీక్షించవచ్చు. పోలీసుస్టేషన్‌ల ద్వారా నిఘా ఉంచి దొంగలు ఇంట్లోకి ప్రవేశిస్తే ఇట్టే పట్టేసే అవకాశం ఈ యాప్ వినియోగం ద్వారా లభిస్తుంది. జనవరి నుంచి ఇప్పటి మార్చి వరకు జిల్లా వ్యాప్తంగా 621 మంది ఈ యాప్‌ను వినియోగిస్తున్నారు. ఎవరైనా ఊర్లకు వెళ్లేవారు ఈ యాప్‌ను వినియోగించుకుంటే దొంగతనాలకు చెక్ పెట్టవచ్చు. జిల్లాలోని కడప నగరంతో పాటు ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల, జమ్మల మడుగు, ఎర్రగుంట్ల, బద్వేలు మున్సిపాలిటీలలో యాప్ సేవలు అందుబాటులో ఉన్నాయని ఎస్పీ తెలిపారు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

ఆండ్రాయిడ్ మొబైల్ కలిగిన వారు ముందుగా ప్లేస్టోరులోకి వెళ్లి లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయాలి. యాప్‌ను ఓపెన్ చేయగానే రిజిస్టరు, రిక్వెస్ట్ పోలీసు వాచ్ అనే రెండు ఆప్షన్లు కనిపిస్తాయి. ముందుగా రిజిస్టరును ఎంచుకుని అక్కడ మీ పేరుతో పాటు, అడ్రస్, సెల్ నెంబరు ఎంటర్ చేయాలి. గెట్ మై లొకేషన్ ఆప్షన్ కూడా ఉంటుంది. దానిపై క్లిక్ చేసి ఇంటి లొకేషన్ గూగుల్ మ్యాప్ ద్వారా అందులో ఎంట్రీ చేయాలి. ఇదంతా ఇంటిలోనే కూర్చునే చేయవచ్చు. తద్వారా పోలీసులు మన ఇంటికి భద్రత ఇవ్వడానికి సులువైన మార్గం ఏర్పడుతుంది. ఆ తరువాత ఒక యూజర్ ఐడీ జనరేట్ అవుతుంది. దాన్ని జాగ్రత్తగా ఉంచుకోవాలి.

నిర్లక్ష్యమే చోరీలకు కారణం

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌పై పోలీసులు అవగాహన కల్పిస్తున్నా.. కొంత మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. దూరప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం అందించకుండానే ఊర్లకు వెళుతుంటారు. వారు తిరిగి వచ్చేసరికి దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికైనా దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడమే మంచిది.

ఇంటికి రక్షణ ..

లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం యాప్ ద్వారా ప్రజల ఆస్తులను రక్షించవచ్చని చెప్పవచ్చు. ఊరెళ్లే ముందు సమాచారం అందిస్తే, పోలీసులు ఆ ఇంటిలో కెమెరాను అమర్చి, చోరీలకు ప్రయత్నించిన దొంగలను తక్షణమే పట్టుకునే అవకాశం లభిస్తుంది.

కెమెరాలే దొంగను పట్టిస్తాయి

అత్యవసర సమయాల్లో యాత్రలు, ఆసుపత్రులు, ఇతర ఊర్లకు వెళ్లినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వెంటనే పోలీసులు కాపలాగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. స్టేషన్ నుంచే ఇంట్లో ఏం జరుగుతుందో నిఘా పెడతారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా సెల్‌ఫోను ద్వారా మన ఇంటిని మనం చూసుకోవచ్చు. ఒకవేళ దొంగలు ఇంట్లోకి ప్రవేశిస్తే పోలీసులు అమర్చిన కెమెరాలు పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటరుకు క్షణాల్లో సమాచారాన్ని అందిస్తాయి. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి క్షణాల్లో దొంగలను పట్టుకునే వీలవుతుంది.

సద్వినియోగం చేసుకోండి

ప్రజలు ఈ యాప్ ద్వారా పోలీసు సేవలను ఉపయోగించుకుని విలువైన వస్తువులకు రక్షణ కల్పించుకోవాలి. ప్రజలందరూ సహకరిస్తే చోరీలను అరికట్టడమే కాక, దొంగల ఆటలను సులువుగా కట్టించవచ్చు. సంప్రదించాల్సిన ఎల్‌హెచ్‌ఎంఎస్ నెం.8186881100, ప్లేస్టోర్‌లో అయితే ఎల్‌హెచ్ ఎంఎస్, ఏపీ పోలీసు యాప్ అందుబాటులో ఉంటుంది.

-వెంకటేశ్వర్లు, సీఐ, కమాండ్ అండ్ కంట్రోల్

పూరిల్లు దగ్ధం.. వృద్ధుడి మృతి

సిద్దవటం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వంట చేసే యత్నంలో పూరింటికి మంటలంటుకోవడంతో ఓ వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. గ్రామస్థుల కథనం ప్రకారం స్థానిక సత్రం వద్ద ఉన్న పూరిపాకలో పిల్లి రాజారెడ్డి (75) అనే వృద్ధుడు కొన్నేళ్లుగా నివసిస్తున్నాడు. అతనికి చూపు సరిగా లేదు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం అన్నం వండుకునే యత్నంలో అతను నివసిస్తున్న గుడిసెకు నిప్పంటుకుంది. ఆ మంటల నుంచి బయటపడలేక వృద్ధుడు మృతి చెందాడు. ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించాడు.

గల్ఫ్‌కు వెళ్లొద్దన్నారని ఆత్మహత్య

గాలివీడు, మార్చి23(ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశానికి వెళ్లొద్దన్నారని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన బూజెల లక్ష్మన్న కుమారుడు హరిప్రసాద్ (53) కువైత్‌కు వెళ్లి వచ్చాడు. మళ్లీ కువైట్‌కు వెళ్లాలని నిర్ణయించుకోగా కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన శనివారం పక్కీరారెడ్డిగారిపల్లెలో నివాసం ఉంటున్న తన మేనల్లుడు ఎద్దుల ఈశ్వర్ ఇంటికి వచ్చి.. మద్యంలో విషం కలుపుకొని తాగాడు. దీంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న హరిప్రసాద్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

కలకడ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): క్వారీ పేలుడుల్లో గాయపడిన రాము(45) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఈ నెల 20న మండలంలోని కోన గ్రామంలోని ఓ క్వారీలో నల్లమందు పేలడంతో అక్కడ పని చేస్తున్న కూలీ రాము గాయపడ్డాడు. అప్పటి నుంచి తిరుపతి రూయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

పిల్లలను ఎత్తుకెళుతున్నారని యాచకులపై దాడి

కడప క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను ఎత్తుకెళుతున్నారన్న అనుమానంతో కడప నగరంలోని చిలకలబావి వద్ద ఆదివారం స్థానికులు యాచకులను చితకబాదారు. విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ నాగార్జున, ట్రాఫిక్ సీఐ జావీద్ అక్కడికి చేరుకుని విచారణ చేయగా, బాధితులు మహారాష్ట్రకు చెందిన వారని, కొద్ది రోజులుగా నగరంలో భిక్షాటన చేసుకుని జీవిస్తున్నట్లు తేలింది. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్థానికులకు సర్ది చెప్పారు. అనుమానం ఉంటే పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలే తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరికాదని హితవు పలికారు. అనంతరం బాధితులను వారి రాష్ట్రానికి పంపించారు.

సెల్‌ఫోన్ దుకాణంలో అగ్నిప్రమాదం

● రూ.18 లక్షల విలువైన సామగ్రి అగ్నికి ఆహుతి


దగ్ధమవుతున్న దుకాణం

ఎర్రగుంట్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో మొబైల్ ఫోన్ల దుకాణం దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో అలీ అనే వ్యక్తి మొబైల్స్ సర్వీస్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం అతని దుకాణానికి మంటలు అంటుకున్నట్టు స్థానికులు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న అలీ ముందు గదిలో ఉన్న కొంత సామగ్రిని బయటికి తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ తాను, తన బావ రంతుల్లా బ్యాంకులో రుణం తీసుకుని దుకాణం నిర్వహిస్తున్నామని, పది రోజుల క్రితమే రూ.8 లక్షల విలువైన సరుకు తెచ్చామని, ఈ ప్రమాదంలో రూ.15 లక్షల నుంచి రూ.18 లక్షల విలువైన ఆస్తినష్టం సంభవించినట్లు తెలిపాడు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


దానమయ్య (ఫైల్‌ఫొటో)

దువ్వూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ వినోద్‌కుమార్ కథనం మేరకు మండలంలోని జిల్లెళ్ల గ్రామానికి చెందిన తలారి దానమయ్య (46) ఆదివారం బైక్‌పై చాగలమర్రికి వెళుతుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సరోజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

క్రీడలతో విద్యా వికాసం

● జేఎన్టీయూ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు


జేఎన్టీయూ ప్రిన్సిపాల్ నుంచి ట్రోఫీ అందుకుంటున్న హోతిశ్రీ


ఖోఖోలో విన్నర్‌గా నిలిచిన కలికిరి జేఎన్టీయూ పురుషుల జట్టు

కలికిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీలు వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు, జట్టు స్ఫూర్తికి దోహదం చేస్తాయని కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక జేఎన్టీయూ కళాశాలలో మూడు రోజులు జరిగిన ఇంటర్ కాలేజీ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్, అనంతపురం జేఎన్టీయూ పీడీ జోజి రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి మొత్తం 830 విద్యార్థులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ కళాశాల ఓవరాల్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. టేబుల్ టెన్నిస్ (పురుషుల సింగిల్స్, పురుషులు డబుల్స్)లో విన్నర్‌గా జేఎన్టీయూ అనంతపురం, రన్నర్‌గా ఎన్‌బీకేఆర్, నెల్లూరు నిలిచారు. టేబుల్ టెన్నిస్ (మహిళలు సింగిల్స్)లో జేఎన్టీ యూ అనంతపురం విన్నర్‌గా, రన్నర్‌గా ఎన్‌బీకేఆర్ నెల్లూరు, టేబుల్ టెన్నిస్ (మహిళలు డబుల్స్)లో కూడా జేఎన్టీయూ అనంతపురం విన్నర్‌గా, పులివెందుల జేఎన్టీయూ రన్నర్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్ (మహిళలు సింగిల్స్)లో కేఎంఎం కాలేజీ, తిరుపతి విన్నర్‌గా, జేఎన్టీయూ అనంతపురం రన్నర్‌గా, బ్యాడ్మింటన్ (మహిళలు డబుల్స్)లో కేఎంఎం తిరుపతి విన్నర్‌గా, గౌతమి కాలేజీ ప్రొద్దుటూరు రన్నర్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్ (పురుషుల సింగిల్స్)లో మిట్స్ మదనపల్లె రన్నర్‌గా, ఎస్ఆర్ఈసీ నంద్యాల రన్నర్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్ (పురుషులు డబుల్స్)లో మిట్స్ మదనపల్లె విన్నర్‌గా, విశ్వోదయ కావలి రన్నర్‌గా నిలిచాయి. త్రోబాల్ (మహిళలు)లో మదనపల్లె మిట్స్ విన్నర్‌గా, జేఎన్టీయూ కలికిరి రన్నర్‌గా నిలిచాయి. హ్యాండ్‌బాల్ (మహిళలు)లో పులివెందుల జేఎన్టీయూ విన్నర్‌గా, ఎన్‌బీకేఆర్ నెల్లూరు రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్ (మహిళలు)లో తిరుపతి ఎస్వీసీఈ విన్నర్‌గా, అనంతపురం జేఎన్టీయూ రన్నర్‌గా నిలిచాయి. ఖోఖో (పురుషులు)లో కలికిరి జేఎన్టీయూ విన్నర్‌గా, కేఎస్ఆర్ఎం కడప కాలేజీ రన్నర్‌గా, హ్యాండ్‌బాల్ (పురుషులు)లో పుత్తూరు సిద్దార్థ కాలేజీ విన్నర్‌గా, కలికిరి జేఎన్టీయూ రన్నర్‌గా,వాలీబాల్ (పురుషులు)లో పుత్తూరు సిద్దార్థ విన్నర్‌గా, మదనపల్లె మిట్స్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి.

పీలేరు హోతిశ్రీకి ప్రశంసలు

జేఎన్టీయూ కలికిరిలో జరిగిన ఇంటర్ కాలేజీ క్రీడా పోటీల్లో పాల్గొన్న తిరుపతి కేఎంఎం కాలేజీలో చదువుతున్న హోతిశ్రీ బ్యాడ్మింటన్ మహిళా విభాగంలో సింగిల్స్, డబుల్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్ సాధించింది. హోతిశ్రీ తండ్రి టి.ప్రభాకర్‌రెడ్డి బ్యాడ్మింటన్ నేషనల్ చాంపియన్ ప్లేయర్. ఆ స్ఫూర్తితో హోతిశ్రీ కూడా బ్యాడ్మింటన్ ఆటను ఒంటబట్టించుకుని ఇంటర్ కాలేజియేట్ స్థాయిలో చాంపియన్‌గా నిలిచింది. తన తదుపరి లక్ష్యం అంతర్జాతీయ స్థాయిలో రాణించడమేనని హోతిశ్రీ తెలిపింది. అద్భుత పటిమతో హోతిశ్రీ అలవోకగా సాధించిన విజయాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

మామిడిపై నీరుగారిన ఆశలు

చక్రాయపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అసలే కాపు తక్కువగా ఉందని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న తరుణంలో శనివారం వచ్చిన గాలివానకు అక్కడక్కడా ఉన్న కాయలు కూడా రాలిపోయాయి. మండలంలోని సురభి, రెడ్డివారిపల్లె, బండ్లయ్యగారిఎల్లె, బీటిపల్లె, కుప్పగుట్టపల్లె, మల్లికవాండ్లపల్లె, వరికుంటపల్లె, ఉటుకూరువాండ్లపల్లె, పాయలోపల్లె తదితర గ్రామాల్లో మామిడి తోటలు అధికంగా ఉన్నాయి. శనివారం గాలివానకు మామిడి కాయలు రాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడుగా శ్రీనివాసరాజు

కడప ఎడ్యుకేషన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షులుగా ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా, రాయచోటికి చెందిన కొండూరు శ్రీనివాసరాజు ఎంపిక య్యారు. రాష్ట్ర అధ్యక్షుడు నడిపినేని వెంకటరావు రాజీనామా చేయడంతో, ఆదివారం ఉదయం గుంటూరులోని ఎన్జీఓ హోంలో నిర్వహించిన రాష్ట్ర తృతీయ కార్యవర్గ సమావేశంలో శ్రీనివాసరాజును అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏబీ రామకృష్ణమరాజు, గౌరవ అధ్యక్షుడు కూరాకు రవీంద్ర, రాష్ట్ర కౌన్సిలర్ అబ్దుల్ గఫార్ కొండూరు శ్రీనివాసరాజును సన్మానించారు. ఎమ్మెల్సీ అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, ఎన్‌టీఏ క్రమశిక్షణ సంఘం చైర్మన్ చెరుకూరి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమారావు, ఉపాధ్యక్షుడు బీవీ నాగేశ్వరరావు, అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్ఐఎంసీకి బి.మఠం విద్యార్థి ఎంపిక

బ్రహ్మంగారిమఠం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : సౌత్‌జోన్ పరిధిలో ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాల స్థాయిలో ఇండియన్ మిలిటరీ కాలేజీ (ఆర్ఐఎంసీ) ఎంట్రెన్స్‌లో కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం విద్యార్థిని సరయురెడ్డి ఎంపికైంది. ఈ విద్యార్థిని కొత్త ఓబులరాజుపల్లెకు చెందిన శీయపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మి దంపతుల కుమార్తె. హైదరాబాదులోని ఇంటర్నేషనల్ స్కూలులో ఏడో తరగతి చదువుతున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.

చవ్వా విజయశేఖర్‌రెడ్డి నేత్రదానం


కార్నియా సేకరిస్తున్న నిపుణులు


పులివెందుల టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణం చవ్వా శుభాకర్‌రెడ్డి కాలనీకి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త చవ్వా విజయశేఖర్‌రెడ్డి (69) మరణించడంతో ఆయన భార్య సునీత, కుమారుడు దుష్యంత్‌రెడ్డి, కుమార్తె మధులిక, చెల్లెలు ప్రమీలమ్మ, బావ వైఎస్ మనోహర్‌రెడ్డి, వదిన సులోచనమ్మ నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృతహస్తం సేవా సమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజులకు సమాచారం అందించారు. దీంతో నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ కార్నియాలను సేకరించి హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేయడం ద్వారా అంధత్వంతో బాధ పడుతూ ఈ లోకాన్ని చూడలేని అంధుల చూపు ఇచ్చే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించేందుకు కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు, బంధువులెవరైనా మరణించినా నేత్రదానం కోసం 9866727534 లేదా 709320453 కు సమాచారం ఇవ్వాలన్నారు.

గంజాయి స్వాధీనం.. ఆరుగురి అరెస్టు

కడప క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మాసాపేటలోని దొరల గోరీల వద్ద గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. కడప డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం డీఎస్పీ వెంకటేశ్వర్లు, టూటౌన్ సీఐ నాగార్జున, ఎస్ఐలు హుసేన్, సిద్దయ్యతో కలిసి నిందితుల వివరాలను వెల్లడించారు. కడపకు చెందిన చల్లావినోద్, జన్గిలి, నవనీష్‌కుమార్, షేక్ ఖాదర్, గూడె పవన్‌కుమార్‌నాయక్, షేక్ సమీర్, గోదాన సుధీర్ గంజాయి విక్రయిస్తున్నట్లు తెలియడంతో టూటౌన్ సీఐ నాగార్జున సిబ్బందితో కలిసి దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసి, 1200 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు . నిందితులను రిమాండుకు తరలించినట్లు వివరించారు.

ఆస్తి కోసం అల్లుడికి చిత్రహింసలు

● మోసం చేసి పెళ్లి చేశారు ● రౌడీలతో కొట్టించారు ● బాధితుడి ఆవేదన


మీడియాకు తన గోడువినిపిస్తున్న బాధితుడు హిదాయతుల్లా

రాయచోటిటౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం తన అత్త, బావమరిది, వారి అనుచరులు కలిసి తనను చిత్రహింసలకు గురి చేస్తున్నారని రాయచోటి పట్టణానికి చెందిన హిదయతుల్లా మీడియాతో వాపోయాడు. రాయచోటిలోని కొత్తపల్లిలో ఓ ప్రైవేటు స్కూల్ నిర్వహిస్తున్న తనకు మూడేళ్ల క్రితం కలకడకు చెందిన యువతితో వివాహమైందని, ఆమెకు సంతానం కలిగే అవకాశం లేదన్న విషయం దాచిపెట్టి తనకు వివాహం చేశారని వివరించాడు. విడాకులు ఇచ్చేస్తానన్న అనుమానంతో తన అత్త, బావమరిది తనను బలవంతంగా కలకడకు తీసుకెళ్లి బంధించి రౌడీలతో కొట్టించారని, ఇంటి మీదికి తీసుకెళ్లి వెనుక వైపు ముళ్ల కంపలు ఉన్న వాగులో పడేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే స్టాంప్ పేపర్లు తెచ్చి తన ఆస్తిపాస్తులు రాసి ఇవ్వాలని చెప్పులతో మొహం పైన, చెరుకు గడలతో చితక బాదారన్నాడు. తన స్కూల్‌లో పనిచేసే యువతితో వివాహేతర సంబంధం ఉందని సృష్టించారని, ఆ విషయం చెప్పేందుకు ఆ యువతి కుటుంబ సభ్యులు వెనుకడుగు వేస్తున్నారన్నారు. తన ఫిర్యాదును పోలీసులు నమోదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని వాపోయాడు.

వైభవంగా గంగ జాతర

చెన్నూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) :చెన్నూరు ప్రజలు భక్తితో కొలిచే గంగమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామ నడివీధిలోని పోలయ్య గారివీధి నుంచి గంగమ్మ, గౌరమ్మ ప్రతిమలు ఊరేగింపుగా తీసుకువచ్చి తూర్పువీధి మైనార్టీ కాలనీలో జాతర జరిగే స్థలంలో నిలిపారు. దీంతో అమ్మవారికి మొదటగా దున్నపోతు, పొట్టేళ్లను బలి ఇచ్చారు. అనంతరం ప్రజలు మూడుగంటల నుంచే అమ్మవారికి జంతుబలులతో పాటు మహిళలు బోనాలు సమర్పించారు.రాత్రి 10గంటల వరకు అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రజలు బారులు తీరారు.

హలాల్ నిషేధం, జట్కా ముద్దు..: ఈ ఏడాది కొత్తగా జాతర ప్రాంగణంలో అమ్మవారికి బలులు సమర్పించేవారంతా హలాల్ పద్ధతిలో కాకుండా జట్కా పద్ధతిలో సమర్పించారు. జాతర ప్రాంగణమంతా హలాల్ నిషేధం, జట్కా ముద్దుఅంటూ బ్యానర్ ఏర్పాటు చేశారు. కాగా చెన్నూరులో ఇటీవల జరుగుతున్న పరిస్థితుల దృష్ట్యా పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు.

కమలాపురం రూరల్..: మండల పరిధిలోని కోగటం, ఎర్రగుడిపాడు, కమలాపురంలో భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి బోనాలు పెట్టి తమ జంతుబలులు ఇచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. చదిపిరాళ్ల గ్రామంలో వెలసిన అంకాలమ్మ తల్లి ఆలయంలో ముద్దల పండుగ నిర్వహించారు.

కోగటం గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే, పుత్తా..: కోగటం గ్రామంలో నిర్వహించిన గంగమ్మ జాతరలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ఎమ్మెల్యే పుత్తాక్రిష్ణచైతన్యరెడ్డి గంగమ్మ జాతరలో పాల్గొన్నారు.

వల్లూరు..: మండల పరిధిలోని దాదాపు అన్ని గ్రామాల్లో గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం గంగమ్మ, పెద్దమ్మ తల్లిని గ్రామ నడిబొడ్డులో పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. బంధువులు, స్నేహితులతో గ్రామాల్లో జాతర సందడి నెలకొంది. ముఖ్యంగా కొప్పోలు గ్రామంలో 45 ఏళ్ల తరువాత యువత ఆధ్వర్యంలో ఈ గంగమ్మజాతర నిర్వహిం చేందుకు మూడు నెలలుగా శ్రమించి జాతరను శనివారం రాత్రి నుంచి ప్రారంభించారు. అనంతరం జంతు బలులు చేసి కొప్పోలు, బోరెడ్డిపల్లె, పుత్తచిన్నయపల్లె గ్రామాల సరిహద్దుల్లో చెల్లించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమా లు చేశారు. అలాగే కొప్పోలే కాకుండా బి.కొత్తపల్లె, తప్పెట్ల తదతర గ్రామాల్లో గంగమ్మ దేవర జాతరను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు.



చెన్నూరు.. భక్తులతో కిక్కిరిసిన గంగజాతర ప్రాంగణం

సీకేదిన్నె..: చింతకొమ్మదిన్నె మండలంలో గంగమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. మండలంలోని ఇందిరానగర్ నడివీధి గంగమ్మ, కమ్మవారిపల్లె, లింగారెడ్డిపల్లె తదితర గ్రామాల్లో అమ్మవారికి బోనాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కొత్తపేట సమీపంలోని గంగమ్మ ఆలయంలో మూడో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కడప నగరం మృత్యుంజయకుంటకు చెందిన శివాంజనేయులు, లక్ష్మీదేవిలు కలిసి రూ.20 వేలు ఖర్చుతో అమ్మవారి అలంకరణకు సహకరించినట్లు ఈవో తెలిపారు. దాతలు భక్తులకు మజ్జిగ, మంచినీరు అందించి సహకరించారు. హిజ్రాలు అమ్మవారికి బోనాలు తెచ్చి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.కాగాబుగ్గలేటిపల్లెలో చౌడేశ్వరీదేవికి జ్యోతుల కార్యక్రమం నిర్వహించారు.







కమలాపురం...కోగటం జాతరలో పాల్గొన్న పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, వల్లూరు..దేవరలో కొప్పోలు యువత, సీకే దిన్నె గంగమ్మ... తల్లికి బోనాలు తెస్తున్న హిజ్రాలు

రక్తదానం ఎంతో విలువైనది



రక్తదాతలను అభినందిస్తున్న తుంగా రమణయ్య

కడప సెవెన్ రోడ్స్ మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు రామ్‌చరణ్ పుట్టిన రోజు వారోత్సవాలలో భాగంగా ఆదివారం కడపకు రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో కడప జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు పంఢ్రా రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా కడప జనసేన పార్టీ నాయకుడు తుంగ రమణయ్య పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదాతలను అభినందించారు.

జీవితానికి దిశ-నిర్దేశం చూపేదే పంచాంగం



పుస్తకాలను వితరణ చేస్తున్న బి. హరిప్రసాద్

కడప కల్చరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జీవితానికి దిశ-నిర్దేశం చూపేది పంచాంగమని టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. హరిప్రసాద్ అన్నారు. విశ్వావసు నామ సంవత్సరం సందర్భాన్ని పురస్కరించుకుని టీటీడీ వారిచే ముద్రించబడిన పంచాంగం పుస్తకాలను ఆదివారం ఆకుల వీధిలోని రాజరాజేశ్వరీదేవస్థానంలో ఆలయ ప్రధానఅర్చకుడు పిడతల గోపాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో వితరణ చేశారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై పంచాంగం పుస్తకాలను నగరంలోని బ్రాహ్మణ, అర్చక, పురోహితులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు బ్రాహ్మణసంఘాల ప్రతినిధులు బి. చంద్రమౌళీశర్మ, శ్రీధర్ శర్మ, సొట్టు సాంబమూర్తి, డాక్టర్ గోపీనాథ్, జి. సుధాకర్‌శర్మ, నరసింహ, ఆలయ ఈవో శ్రీధర్, నాయకులు బండిబాబు పలువురు బ్రాహ్మణులు పాల్గొన్నారు. కాగా భారత జాతీయ కళా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ సారథ్యంలో ఆది వారం స్థానిక మానస ఇన్ గార్డెన్‌లో నగర ప్రముఖుల సమక్షంలో టీటీడీ ఆధ్వర్యంలో రూపొందించిన పంచాంగ పుస్తకాన్నివితరణ చేశారు. ఇందులో నగర ప్రముఖులు చిన్నపరెడ్డి, పోతుల వెంకట్రామిరెడ్డి, జిల్లా అర్చక పురోహిత ఐక్యవేదిక అధ్యక్షుడు విజయభట్టర్, ప్రభాకర్‌శర్మ, సుధీర్‌శర్మ, ప్రదీప్ శర్మ పాల్గొన్నారు.

మత్తుతోనే జీవితాలు నాశనం

కడప క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చిన్నతనంలోనే మత్తుకు అలవాటు పడి తే జీవితాలు నాశనమవుతాయని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. కడప టూటౌన్ సీఐ నాగార్జున ఆధ్వర్యంలో ట్యాబ్లెట్లు వినియోగిస్తున్న పిల్లలు, యువకులను గుర్తించారు. వారి కుటుంబ సభ్యులను ఆది వారం కడప డీఎస్పీ కార్యాలయానికి పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు హుస్సేన్, సిద్ధయ్య పాల్గొన్నారు.

అద్దె బకాయిల్లో మినహాయింపు ఇవ్వండి

కడప మారుతీనగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్టీసీ బస్టాండు వద్ద ఇటీవల డ్రైనేజీ పెద్ద కాల్వ నిర్మాణ మరమ్మతులు చేపట్టిన కారణంగా దాదాపు మూడు నుంచి ఐదు నెలల పాటు ఆర్టీసీ కాంప్లెక్స్ తాలూకు అద్దె రూముల్లో వ్యాపారాలు లేక సతమతమయ్యామని అద్దె రూముల యజమానులు బాబు, నవనీశ్వర్‌రెడ్డి, దస్తగిరమ్మ వెల్లడించారు. ఆదివారం ఆర్టీసీ బస్టాండు వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

ఇద్దరు అరటి రైతుల ఆత్మహత్యాయత్నం

పులివెందుల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి):ఈదురుగాలులకు అరటి తోటలు పడిపోవడంతో ఇద్దరు రైతులు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గంలోని యల్లనూరు మండలం నేర్జాంపల్లెకు చెందిన లక్ష్మీనారాయణ, వెంగప్ప కలుపునివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. శనివారం రాత్రి వీచిన ఈదురుగాలులకు ఇద్దరి రైతులకు సంబంధించి 20ఎకరాల్లో సాగుచేసిన అరటి పూర్తిగా దెబ్బతింది. దీన్నిచూసిన రైతులు ఆవేదనతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అప్పులు చేసి సాగుచేసిన పంట ఇలా అయిందే అని ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది. వీరిని పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వీరికి పులివెందుల ఆసుపత్రిలో వైద్యసేవలు అందించారు. వైద్యులు వీరి ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు వైద్యులు ప్రకటించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సీకేదిన్నె, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాథపురంలో నివాసం ఉండే గంగాధర్ అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వడ్డీ వ్యాపారి వేధింపులకు గురిచేస్తున్నాడని తీవ్ర ఆవేదనకు గురైన గంగాధర్ తన ఇంటి సమీపంలో ఆదివారం మద్యంలో విషద్రావణం కలుపుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కులం పేరుతో కూడా దూషించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపినట్లు సమాచారం. ప్రస్తుతం తీవ్ర అస్వస్థతతో రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

30శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పీఆర్సీ చైర్మన్‌ను నియమించాలని, 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్ చేశారు. ఆదివారం ఆపస్ కార్యాయలంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు రూ.30వేలకోట్ల ఆర్థిక బకాయిలలో రూ.6200కోట్లు మాత్రమే ప్రకటించడం ఏమాత్రం సరిపోదని, మిగిలిన ఆర్థిక బకాయిల విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయప్రసాద్ మాట్లాడుతూ మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో సుదూరంలో ఉన్న పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను విలీనం చేయడం అలా అనేక ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరామిరెడ్డి, వివిధ మండల బాధ్యులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి ఉచిత శిక్షణ తరగతులు

పులివెందుల టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : ఒకటి నుంచి ఉచిత పాలిసెట్, ఏపీఆర్‌జేసీ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. నియోజకవర్గంలోని పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల కోసం స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఉచిత వైద్య ఉపాధ్యాయ బృందం పాలిసెట్, ఏపీ ఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలకు నిర్వహిస్తున్నట్లు ఉచిత శిక్షణ తరగతుల కరపత్రాలు ఆదివారం ఉర్దూ ఉన్నత పాఠశాల ఆవరణంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు విడుదల చేశారు. వివరాలకు 9866727534, లేదా 7093204537 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌తో ప్రజలకు భద్రత భరోసా

కడప క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశించారు. దీంతొ విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పోలీసు అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను విచారించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి వార్షికోత్సవం



ప్రత్యేక అలంకారంలో చౌడేశ్వరీదేవి

కడప కల్చరల్, మార్చి23 (ఆంధ్రజ్యోతి): నగర ఎర్రముక్కపల్లెలో వెలసిన చౌడేశ్వరీదేవి దేవస్థానం వార్షికోత్సవాలు ఆ ఆలయ కమిటీ అధ్యక్షుడు కల్యా సుధాకర్ ఆధ్వర్యంలో సాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం రాత్రి చౌడేశ్వరీ దేవిని ప్రత్యేక వాహనంలో జ్యోతులతో గ్రామోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఉదయం 7 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. తదుపరి అక్కడే వెలసిన గంగమ్మతల్లికి మహిళలు నిండుకుండ బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అత్యంత భక్తిశ్రద్ధలతో బిందెసేవ, మధ్యాహ్నం 3 గంటలకు చౌడేశ్వరీదేవి అమ్మవారికి బోనాలు నిర్వహించారు. కాగా నగర ఎర్రముక్కపల్లెలో వెలసిన గ్రామ దేవత నడివీధి గంగమ్మతల్లి వార్షిక జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బీటెక్ రవి

సింహాద్రిపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాళమ్మగూడూరులో వైసీపీ నుంచి టీడీపీలోకి పలు కుటుంబాలు చేరాయి. అంకాళమ్మగూడూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు వెలుగోటి బాబురెడ్డి తన అనుచర వర్గంతో ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం అంకాళమ్మతల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గాయపడ్డ వ్యక్తి మృతి

లింగాల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువపల్లె గ్రామానికి చెందిన దుబ్బల రామచంద్రారెడ్డి (65) అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రామచంద్రారెడ్డి తమ ఇంటిని ఎక్స్‌కవేటర్‌తో కూల్చి వేయడం జరిగింది. కూల్చివేసే సమయంలో ట్రాక్టర్ వెనకకు వస్తూ గోడను ఢీకొనడంతో గోడ రామచంద్రారెడ్డిపై పడింది. దీంతో తీవ్రంగా గాయపడగా చికిత్స కోసం పులివెందులకు తరలించగా, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. పరిస్థితి విషమించడంతో రామచంద్రారెడ్డి శనివారం రాత్రి మృతిచెందాడు.

త్వరలో తాత్కాలిక జాబితాలో గండికోట

కడప ఎడ్యుకేషన్,మార్చి 23 (ఆంధ్రజ్యోతి): త్వరలో గండికోట పర్యాటక ప్రాంతాన్ని యునెస్కో తాత్కాలిక జాబితాలో చేర్చే అవకాశం ఉందని, ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సల్ సభ్యుడు లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఈ పదవికి ఎన్నికైన తర్వాత తొలిసారిగా కడపకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ యునెస్కో జాబితాలో గండికోటను చేర్చేందుకు మరికొన్ని చర్యలు చేపట్టాల్సి ఉందని, వాటినిపూర్తిచేసేందుకు ఢిల్లీలోని ఇంటాక్ కేంద్ర కార్యాలయం ద్వారా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఇంటాక్ సభ్యులు, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు వెళ్లాలి

కమలాపురంరూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. విద్యార్థులు ఆత్మహత్యల నివారణకు టీఎన్‌ఎస్‌ఎఫ్ ముద్రించిన పోస్టర్లను ఆదివారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ఉపా ధ్యక్షులు చేతన్‌కుమార్‌రెడ్డి, భార్గవ్, కార్యదర్శి అక్షయ్ కుమార్‌రెడ్డి, ఫరీద్, సుమంత్, తెలుగు యువత కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలు నేర్పించడమే ఉల్లాస్ లక్ష్యం

వేముల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చదువురాని వయోజనులైన మహిళలకు రోజువారి పనుల్లో ఉపయోగపడే అవసరమైన జీవన నైపుణ్యాలు నేర్పించడమే ఉల్లాస్ లక్ష్యమని వెలుగు ఏపీఎం అంజనేయులు తెలిపారు. ఆదివారం మండలంలోని ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్ కేంద్రాలను ఏపీఎం ఆంజనేయులు, అడల్ట్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ ఈశ్వరయ్య పర్యవేక్షణ చేశారు. ఆదివారం నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన మహిళలను అక్షరాస్యులుగా గుర్తిస్తూ జాతీయ సార్వత్రిక విద్యాసంస్థ వారు అధికారిక ధ్రువీకరణ పత్రాలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు, డ్వాక్రా లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదంపై పోరాటానికి సిద్ధం కావాలి

కడప సెవెన్ రోడ్స్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వ వినాశకర విధానాలను నిరసిస్తూ సీపీఐ దేశవ్యాప్త ప్రచారోద్యమం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. కాగా ఆదివారం కోటిరెడ్డి సర్కిల్లో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని సీపీఐ రాజకీయ ప్రచార జాతను ప్రారంభిస్తున్నామని ఇది ఏప్రిల్ 14వ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటశివ, బాదుల్లా, వలరాజు, సభ్యులు, ఏఐవైఎఫ్ నాయకులు శరత్, ప్రభాకర్, శివనాగేంద్ర, శివతేజ, అరుణ్, నాగార్జున పాల్గొన్నారు.

మానవీయ విలువలు పెంచడమే మానవత లక్ష్యం

కడప సెవెన్ రోడ్స్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మానవీయ విలువలు పెంపొందించేందుకు మానవతా ఆవిర్భవించింది మానవతా సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఆవరణంలో ఆదివారం మానవత సంస్థ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజంలో మంచిని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ డైరెక్టర్ రాటాలా, డైరెక్టర్ రామాంజులరెడ్డి, సుబ్బరాయుడు, సుబ్రమణ్యం, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరాజు, యల్లారెడ్డి, కృష్ణారెడ్డి, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

కెమెరామన్‌పై దాడి

కడప క్రైం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బిల్టప్ సర్కిల్ వద్ద ఓ ఉర్దూ చానల్ కెమెరామన్‌పై ఓ యువకుడు దాడి చేశాడు. పోలీసుల వివరాల మేరకు ఓ ఉర్దూ చానల్‌లో పనిచేస్తున్న ఆయూబ్ పని నిమిత్తం బిల్టప్ సర్కిల్ వద్ద వెళ్లగా అక్కడ మహిళలను ఓ యువకుడు అసభ్యంగా దూషిస్తుండగా ఆయూబ్ అక్కడికెళ్లి సర్ది చెప్పే ప్రయత్నం చేయగా ఆ యువకుడు తన చేతికున్న కడియం తీసుకుని కెమెరామన్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో కెమెరామన్ తలకు గాయమయింది. అక్కడున్న కొందరు ఆ వ్యక్తిని పట్టుకోవడానికి ప్రయత్నించగా అతను పరారయ్యాడు. కాగా బాధితుడిని రిమ్స్‌కు తరలించారు.

యశోదకు సేవారత్న అవార్డు

వేంపల్లె, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె భవిత కేంద్రంలో పనిచేస్తున్న ఐఈఆర్టీ యశోదకు సేవారత్న అవార్డుతో సత్కరించారు. ప్రొద్దుటూరుకు చెందిన కేసీ పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సత్కరించారు.

బోర్లకు మరమ్మతులు

కాశినాయన మార్చి23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నర్సాపురంలో ఆదివారం సర్పంచ్ బి.చిన్నఖాజావలి ఆధ్వర్యంలో బోర్ల మరమ్మతులు చేపట్టారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజల తాగునీటి అవసరాలకు రంగారెడ్డి ఎగువ దిగువ కాలనీల్లో చెడిపోయిన బోర్లను రిపేరు చేయించారు.

దళితవాడల అభివృద్ధి కలేనా..?

● మౌలిక వసతులకు నోచుకోని వైనం ● ప్రజా ప్రతినిధుల హామీలు నీటి మూటలు



మట్టిదారికే పరిమితమైన ఎగువపాలెం



చింతపుత్తాయపల్లె దళితవాడలో చిన్న ట్యాంకు

బద్వేలు రూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి):స్వాతంత్ర్యం సిద్ధించి 77సంవత్సరాలు కావస్తున్నా నేటి కీ చాలా చోట్ల దళితవాడలు మౌలికసదుపాయాలకు నోచుకోలేదు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు దళితవాడలకు ఓట్ల అడిగేందుకు వెళ్లినప్పుడు ఇచ్చిన హామీలన్నీ నీటిమూటలయ్యాయి. వీధి దీపాలు, సిమెంట్‌రోడ్లు, తాగునీటి సౌకర్యం, కొన్ని దళితవాడలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. మండల పరిధిలోని చింతపుత్తాయపల్లెలోని దళితవాడ మున్సిపాలిటీ పరిధిలోకి చేర్చినప్పటికీ మౌలికసదుపాయాలకు నోచుకోలేదు. దాదాపు 60 కుటుంబాలు, 300 పైగా జనాభా ఉన్నారు. అయితే మున్సిపల్ తాగునీటి కనెక్షన్లు ఏర్పాటు చేయలేదు. ఎప్పుడో 20సంవత్సరాల క్రితం క్రిష్టియన్ సొసైటీవారు వేసిన చేతిపంపుకు మున్సిపాలిటీవారు మోటారు ను బిగించి ఓ పదివేల లీటర్ల కెపాసిటీ ఉన్న ట్యాంకును బిగించారు. గ్రామమంతా వచ్చి అక్కడి నుంచే నీటిని తీసుకువెళ్లాలి. అలాగే దళివాడ కు చెందిన శ్మశానవాటిక కూడా కొంతమేరా కబ్జా అయినట్లు దళితవాడ ప్రజలు పేర్కొంటున్నారు. స్మశానవాటికకు వెళ్లేందుకు సరైన దారికూడా లేదని ఆరోపిస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని 33 వ వార్డులో ఉన్న బంకపాలెం, ఎగువపాలెం, దిగువపాలెంలో దాదాపు 100 కుటుంబాలు, 600 పైబడి జనాభా నివశిస్తున్నారు. ఎగువపాలెం, బంకపాలెం వచ్చేందుకు సిమెంట్‌రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో పట్టణానికి వచ్చి ఇళ్లకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎగువపాలెంలో విద్యుత్తు స్తంబాలను ఏర్పాటుచేసి, వీధిలైట్లు బిగించకపోవడంతో రాత్రుళ్లు చిమ్మచీకట్లతో ఇబ్బందులు పడుతున్నారు. పాలెంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల నూతన భవనం పిల్లర్స్‌స్థాయిలోనే ఆగిపోయింది. ఇలా మండల పరిధిలో ప్రతి దళితవాడలో ఏదో ఒక సమస్యతో సతమతమవుతున్నాయి. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద నిధులను కేటాయించి దళితవాడల అభివృద్ధికి దోహదపడాలని ప్రజలు కోరుతున్నారు.

రక్షిత మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేయండి



దళితవాడలో రక్షితమంచి నీటి ట్యాంకును ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం మున్సిపాలిటీవారు ఏర్పాటుచేసిన చిన్ననీటి ట్యాంకు ద్వారా నీటిని తెచ్చుకుం టున్నాం. దీంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్మశానవాటిక కబ్జాకు గురైంది. రహదారి కూడా సరిగా లేదు. అధికారులు ప్రజాప్రతినిధులు సమస్యల పరిష్కారం కోసం చొరవచూపాలి.

-బత్తలకూరి చెన్నయ్య, చింతపుత్తాయపల్లె, దళితవాడ

దళితవాడలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



మున్సిపల్ పరిధిలోని బంకపాలెం, ఎగువపాలెం, దిగువపాలాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలి. వీధిలైట్లు లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాలనీలో మట్టిరోడ్డు కావడంతో వర్షాకాలం బురదతో ఇబ్బందిపడుతు న్నాం. పాఠశాల భవనాన్ని పూర్తిచేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి. దళితవాడల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు ముందుకు రావాలి.

-నాగిపోగు ప్రసాద్, ఎగువపాలెం

నిరక్షరాస్యులకు వయోజన విద్య పరీక్ష



కొండాపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులలో నిరక్షరాస్యులైన వారిని గుర్తించి ఆదివారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ కింద పరీక్షలు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలో డ్వాక్రా సంఘాలలోని నిరక్షరాసుల కు ఈ పరీక్షను నిర్వహించినట్లు వయోజన విద్య సూపర్‌వైజర్ జయచంద్రారెడ్డి తెలిపారు. మండలంలో 590 మంది ఈ పరీక్షను రాశారన్నారు. సంఘాలలోని నిరక్షరాసులు చదువు నేర్చుకున్న తర్వాత వారికి ఈ పరీక్షను నిర్వహించి సర్టిఫికెట్ ను అందజేయడం జరుగుతుందని తెలిపారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

అట్లూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు మండలంలోని కేజీబీవీ బాలికల పాఠశాల ప్రవేశాలకు ఏప్రిల్ 11వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంఈవో విలియం రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 12 తరగతుల వరకు దరఖాస్తు చేసుకొనేందుకు వెసులుబాటు ఉందని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తామని ఆయన తెలిపారు.

పీఎం, సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

కొండాపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేస్తున్నందుకు ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంఆర్పీఎస్ నేత మందకృష్ణ చిత్రపటాలకు ఆదివారం ఎంఆర్పీఎస్ నాయకులు కొండాపురంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ఎంఆర్పీఎస్ నేత మందకృష్ణమాదిగతో పాటు ఎంతోమంది ఎంఆర్పీఎస్ నాయకులు, కార్యకర్తలు అలుపెరగని పోరాటం సాగించారన్నారు. కార్యక్రమంలో ఎంఈర్పీఎస్ నాయకులు జయరాజు, శ్రీనివాసులు, నాగసుబ్బరాయుడు, రమేష్, నాగన్న పాల్గొన్నారు.

బి.మఠంలో సంబరాలు

బ్రహ్మంగారిమఠం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కక్కయ్యమఠం సమీపంలో ఆదిజాంబవ అరుంధతీ అన్నదాన సత్రంలో ఎమ్మార్పీఎస్ నేతలు వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మార్పీ ఎస్ మండల అధ్యక్షుడు ఎర్రంపల్లె జ్ఞానేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ క్యాబినెట్ తీర్మానం రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానానికి అంగీకరించిన మాలమాదిగ మంత్రులు, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నేతలు చిన్నరాయుడు, చెన్నయ్య, నారాయణ, చలపతి, ఓబయ్య, హరి, రమేశ్, అరవింద్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో దొందూదొందే



మాట్లాడుతున్న తులసిరెడ్డి

పోరుమామిళ్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి):రైతులను ఆదుకోవడంలో టీడీపీ, వైసీపీ దొందూ దొందేనని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పోరుమామిళ్లలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు అష్టకష్టాలు పడి పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర లభించడంలేదన్నారు. కంది, శెనగ, జొన్న, పెసర, మినుము, మిరప తదితర పంటలకు ప్రభుత్వం ప్రకటంచిన కనీస మద్దతు ధర కూడా లభించడంలేదన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఒక్కపైసా కూడా ఇవ్వలే దన్నారు. 2025-26లో 10706 కోట్లు రావాల్సి ఉండగా 6300 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం తెరిచి మద్దతు ధరకు పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు. పెండింగు బకాయిలతో కలిపి ప్రతి రైతుకు ఖాతాలో రూ.40వేలు వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలి

గోపవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని రాష్ట్ర రైతు సాధికార సంస్థ చైర్మన్ టి.విజయకుమార్ సూచించారు. గోపవరం మండలంలోని రాచాయిపేట, అగ్రికల్చర్ ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో రాష్ట్ర రైతు సాధికార సంస్థ చైర్మన్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఒక ఎకరా పొలం ఉంటే అందులో కనీసం అర ఎకరంలోనైనా రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే ప్రజల ఆరోగ్యం కొంత వరకు కాపాడిన వారమవుతారని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఓబయ్య పాల్గొన్నారు.

దేవగుడిలో ఘనంగా పెద్దమ్మ జాతర



దేవగుడిలో గ్రామదేవతకు పూజలు చేస్తున్న భక్తులు

జమ్మలమడుగు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంలో ఆదివారం గ్రామ దేవత పెద్దమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా శనివారం రాత్రి అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. గ్రామస్థులు బోనాలు అమ్మవారి వద్దకు తీసుకెళ్లి సమర్పించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి జాతరకు వచ్చారు. వచ్చిన భక్తులు తలకంటీశ్వరీదేవి దేవాలయంలో పూజలు చేశారు.

ఘనంగా పెద్దమ్మ, చిన్నమ్మ దేవర

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోట వీధిలో ఆదివారం పెద్దమ్మ, చిన్నమ్మ అమ్మవారి దేవర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి పుట్టమన్ను తెచ్చి అమ్మవారిని చేసి మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి ఇంటి వద్ద ఆశీనులను చేశారు. పూర్వం నుంచి కోట వీధి దేవర మహోత్సవానికి విశిష్టత ఉండడంతో పట్టణంతోపాటు పల్లెల నుంచి భక్తులు అమ్మవారికి చల్లను సమర్పించి మొక్కుకున్నారు. కొందరు భక్తులు కోళ్లు, మేకలు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

30 నుంచి సుంకులాంబ తిరునాళ్ల మహోత్సవాలు

మైలవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వద్దిరాలలో వెలసిన సుంకులాంబ పరంజ్యోతి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. తిరునాళ్ళ మహోత్సవాన్ని పురష్కరించుకుని 30న కోలాటం, హైదరాబాదువారిచే మ్యాజిక్ షో, చెక్కభజన, 31న వేషధారణ, సిరిమాను ఉత్సవం, రేలారేరేలా ప్రోగ్రాం, ఏప్రిల్ 1వ తేదీన అఖిలభారత ఒంగోలుజాతి బండలాగుడు పోటీలు, అదే రోజు రాత్రి చింతామణి నాటకం, 3వ తేదీ రెండు బండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఉంటుందని తెలిపారు.

ఏడుగురు క్రికెట్ బుకీలకు పోలీసుల కౌన్సెలింగ్



ప్రొద్దుటూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్‌బెట్టింగ్ ను అరికట్టడంలో బాగంగా ఒన్‌టౌన్ పరిధిలోవున్న అక్రమ్ ,సోహెల్, నాగేంద్ర, ఫారుక్, మనోజ్ ,ఆనంద్, బండి లక్ష్మీనారాయణ ఏడుమంది క్రికెట్ బుకీలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆదివారం ఒన్‌టౌన్ సీఐ రామకృష్ణా రెడ్డి ఎస్‌ఐ సంజీవరెడ్డిలు మధ్యాహ్నం ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ ప్రారంభం అయినప్పటినుంచి ముగిసే వరకు బుకీలను స్టేషన్‌లోనే కూర్చొబెట్టారు. అనంతరం బుకీలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఐపీఎల్ మ్యాచ్ ముగిసేవరకు ఎటువంటి బెట్టింగ్‌లకు పాల్పడినా నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని ఆస్తులు సైతం అటాచ్ చేస్తామని హెచ్చరించారు. పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చిన బుకీలలో వైసీపీకి చెందిన వారే ఎక్కువ మంది ఉన్నారు.

బాలికల వసతి గృహానికి ఇన్వర్టర్ వితరణ

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహానికి ఇన్వర్టర్‌ను వితరణ చేశారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు 1983-84 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు హాస్టల్‌లో విద్యుత్తు కోత వలన విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇన్వర్టర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కృష్ణార్జునరెడ్డి, మోహన్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్ మనోరాణి, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక నేరాలకు పాల్పడితే జైలు శిక్ష తప్పదు

● అమృతనగర్ యువతకు డీఎస్పీ భావన కౌన్సెలింగ్
● వాహనాల తనిఖీలో 45 మోటార్ బైక్‌లు, మూడు ఆటోలు సీజ్



అమృతనగర్‌లో యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు , మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక నేరాలైన దొంగతనాలు, క్రికెట్ బెట్టింగ్, గంజాయి విక్రయాలు ,మట్కా, జూదం, అక్రమ మద్యం వ్యాపారం నిర్వ హించినా మహిళలను వేధించినా కేసు లు పెట్టి జైలుకు పంపుతామని యువకు లను డీఎస్పీ భావన హెచ్చరించారు. ఆదివారం తెల్లవారు జామున అమృతనగర్‌లో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. వాహ నాల తనిఖీ చేపట్టి నంబర్‌ప్లేట్‌లులేని డాక్యుమెంట్స్‌లేని వాహనాలను దాదాపు 45 మోటార్ బైక్‌లను, మూడు ఆటోలను సీజ్ చేశారు. అనంతరం అమృతనగర్‌లోని యువ కులకు డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చి ఎలాంటి అసాంఘిక నేరాలకు పాల్పడకుండా ఉండాల న్నారు. ఈ సర్చ్‌లో రూరల్ సీఐ బాలమద్దిలేటి, త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి, ఒన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐలు సురేష్ రఫీ సంజీవరెడ్డి ధనుంజయుడులు పాల్గొన్నారు.

మట్టితరలింపును అడ్డుకుని చెరువును కాపాడండి

● ధర్నాలో సుగాలితాండా కాలనీ వాసులు



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

ఖాజీపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మట్టి తరలింపును అడ్డుకుని నాగసానిపల్లి చెరువును కాపాడాలంటూ సుగాలితాండా కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఆమేరకు ఆదివారం రోడ్డుకు అడ్డంగా మట్టిని వేసి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు మాట్లాడుతూ చెరువులో ఇష్టానుసారంగా 10 మీటర్లలోతు తవ్వి మట్టిని తరలించి చెరువును నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తద్వారా చెరువు కింద భూములు నీరు లేక బీడుగా వదలుకోవాల్సి వస్తోందని వాపోయారు. వెంటనే ఉన్నతాధికారులు కలుగజేసుకుని మాకున్యాయం చేయాలని కాలనీ వాసులు అంటున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకారులతో మాట్లాడి అక్కడి నుంచి వారిని పంపించి వేశారు. కాగా ఈ సంఘటనపై సీఐ మోహన్‌ను వివరణ కోరగా హైవేవారికి పర్మిషన్ ఉందని, అయితే గ్రామస్థులు మాత్రం అడ్డుకుంటున్నారన్నారు. దీంతో గ్రామస్థులకు చెప్పి అడ్డుగా ఉన్న మట్టిని తొలగించి యథావిధిగా తోలేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రజల సమస్యలు ఏవైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లి పరిష్కరించుకోవాలని, మరోసారి అడ్డుకుంటే కేసు నమోదు చేస్తామన్నారు.

108 వాహనానికి చికిత్స చేయండి



ముద్దనూరు మార్చి23(ఆంధ్రజ్యోతి):ప్రమాదంలో ఉన్న వారికి ప్రాణాలను కాపాడే ముద్దనూరు సంబందించిన 108 వాహనానికి చికిత్సలు చేయాలని ప్రజలు కోరుతు న్నారు. వాహనం మరమ్మత్తుకు గురికావడంతో మరమ్మత్తు చేసేందుకు కడపకు తరలించినట్టు సమాచారం. దాదాపు 20 రోజులు దాటిన వాహనం మండలానికి రాకపోగా కనీసం దాని స్థానంలో మరొకటి ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. కడప- తాడిపత్రి రహదారి నేషనల్ హైవే కావడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజల వైద్య సేవల సౌకర్యార్థం 108 వాహనాన్ని త్వరగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాగా వీలైనంత త్వరగా వాహనాన్ని అందుబాటులో ఉంచుతామని 108 జిల్లా మేనేజర్ సురేంద్ర పేర్కొన్నారు. వాహనం చాలా పాత మోడల్ కావడంతో ఇంజన్ సామగ్రి లభించడంలో ఆలస్య మైందని బుధవారానికి వాహనాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు.

సీఐ నాగభూషణ్‌కు ప్రతిష్టాత్మక సేవా పతకం



గోపవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామీణులకు ఉత్తమమైన సేవలందించిన రూరల్ సీఐ నాగభూషణ్‌కు ఈ ఏడాది ఉగాది పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం రాష్ట్ర పోలీసు మహోన్నత సేవాపతకాన్ని ప్రకటించింది. ఈ మహోన్నత సేవా పతకాన్ని ఈ ఏడాది నవంబరు 1వతేదీన అమరావతిలో జరిగే ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఇన్‌స్పెక్టర్ నాగభూషణ్ అందుకోనున్నారు, ఏపీరాష్ట్ర పోలీసుశాఖలో నిస్వార్థంగా చేసిన సేవలనుగుర్తించి నాగభూషణ్‌కి ఈ అవార్డుకు ఎంపిక చేయడం జరిగింది. గతంలో చిత్తూరు జిల్లా చంద్రగిరి పోలీసుస్టేషన్, నంద్యాల జిల్లా, ఆత్మకూరు రూరల్, కడప జిల్లా పులివెందుల అర్బన్, మైదుకూరు రూరల్, కడప తాలుకా యూపీఎస్ ఇంటెలిజెన్స్, ఆర్ఎస్‌టాస్క్‌ఫోర్స్‌లలో సమర్థవంతంగా పనిచేసి అనేక రివార్డులు, అవార్డులు పొందారు. ప్రస్తుతం బద్వేలు రూరల్ సర్కిల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈయనకు మహోన్నత సేవా పతకం రావం పట్ల మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్, గోపవరం ఎస్‌ఐ శ్రీకాంత్, పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు ఆశయాలను కొనసాగిస్తాం



భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

బద్వేలు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు పేర్కొన్నారు. బద్వేలు పట్టణంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం సీపీఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ మాట్లాడుతూ చిన్న వయసులో వారు దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన రియల్ హీరోలని కొనియాడారు.అలాగే భగత్‌సింగ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, ఏఐఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి నవీన్, జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మొక్కలు నాటిన అధికారులు

విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ ఆవరణలో మొక్కలు నాటారు. బద్వేలు ఆర్టీసీ డిపో మేనేజర్ చైతన్య నిరంజన్, ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయ్‌కుమార్‌లు మొదటగా భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు , డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



ప్రొద్దుటూరు టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసినవారు ప్రాణదానం చేసినవారు అవుతారని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని పురష్కరించుకుని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులు బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా పోరాడి చిరుప్రాయంలోనే ఉరిశిక్షకు గురయ్యారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓబులేసు, రహమతుల్లా, తదితరులున్నారు.

విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకోవాలి

పోరుమామిళ్ల, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులు లక్ష్యాలు ఎంచుకుని విద్యాభ్యాసం చేయాలని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డిఅన్నారు. ఆదివారం స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలు ఎంచుకుని ఉన్నత శిఖరాలకు అధిరోహించి తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. సమాజాభివృద్ధికి తోడ్పడాలన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిగ్రీకళాశాల ఇన్‌చార్జ్ ప్రకాశ్, కరస్పాండెంట్ ఓబుల్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, రమణారెడ్డి, కాశినాయన జడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.